కథానిక

# ఊహించని ఉపకారం

ముద్దంశెట్టి హనుమంతరావు

సుదర్శనం చదువూ, సంస్కారం, వున్న నవ నాగరికుడయినప్పటికీ గొప్ప ఛాందసుడు. పూర్వాచారాలు అతనిలో దట్టంగా అల్లుకుపోయి వున్నయ్. తలపెట్టిన ప్రతీ కార్యానికీ ముహూర్తమూ, చెడ్డలు ముందుగానే చూస్తాడు. అంతటిలోగాని సంతృప్తి పొందడు. కార్యాలు ఫలించాయా తృప్తిపొందుతాడు. నిష్ఫలమయ్యాయా, ముహూర్తం మంచిదికాదంటాడు.

పెద్దాపురం ప్రయాణం పెట్టుకున్నాడు సుదర్శనం. అదీ పోతున్నది తమ్ముడి పెళ్ళి ప్రయత్నానికి. ముహూర్తం చూడకుండా అడుగు బయట పెడతాడా? మాంచి అనుభవంవుండి పేరుపొందిన పౌరోహితుణ్ణి అడిగాడు. మంగళవారం మంచి దినమన్నాడాయన. మంగళవారం తప్పితే అంత ఘనమైన ముహూర్తాలు మరి లేవన్నాడు.

ఆ మంగళవారం ఆరునూరైనాసరే ప్రయాణం ఆగిపోకూడదనుకున్నాడు సుదర్శనం. అనుకున్నాడేగాని, ఆలోచిస్తే అంత సులభంగా అగుపించలేదు. ఎందుకూ అంటే సూర్యం సుదర్శనం దగ్గర రెండువందల రూపాయలు అప్పుపుచ్చుకొన్నాడు; ఈవాళ, రేపు యిస్తానంటూ అప్పటికే పదిహేను దినాలు దాటిపోయాయ్. ఆ డబ్బు వసూలయితేనేగాని బయలుదేరే పరిస్థితిలో లేడు సుదర్శనం.

"చూడు సూర్యం...నీ అవసరార్థం ఆ రెండు వందల రూపాయలు యిచ్చాను"అని యింకేదో అనబోయాడు సుదర్శనం ఓరోజు. కాని సూర్యం అర్థోక్తిలో అందుకుని-

"నేనుమాత్రం కాదన్నానా సుదర్శనం..." అన్నాడు చిన్నబుచ్చుకొంటున్నట్టుగా.

"అదికాదురా! నాకిప్పుడు డబ్బు అత్యవసరం. నీతో చెప్పానుగా నేను పెద్దాపురం వెళ్ళాలని—ఆ డబ్బు నా చేతిలో సోమవారంలోగా, కనీసం మంగళవారంనాడైనా పడకపోయిందా ప్రయాణం తప్పి, ప్రయత్నాలన్నీ విఫలమైపోయి, కొంత డబ్బు నష్టమవుతుంది"అన్నాడు సుదర్శనం. నిజానికి సూర్యం డబ్బు యివ్వకపోతే ప్రయాణం తప్పిపోతుందేమోగాని, డబ్బు నష్టమవుతుందన్నమాట సర్వాబద్ధం. అవుతేనేం ఆ సమయంలో అలా అనక తప్పిందికాదు.

"ఏంచెయ్యమనురా సుదర్శనం- నీకు తెలుసుగా నేనెన్ని విధాల ప్రయత్నిస్తున్నానో! నా ప్రయత్నం ఒక్కటీ ఫలించకుండావుంది. వడ్డీ అధికంగా యిస్తానంటున్నాకూడా...దొరికితేగా! ఒకనిదగ్గరమాత్రం దొరుకుతుందనే ఆశ వుంది. ఆయన యిచ్చినవెంటనే యిచ్చేస్తాను. అవసరానికి ఆదుకున్న నీకు అపకారంచేస్తానా?" అన్నాడు సూర్యం తను డబ్బు సకాలానికి యివ్వలేకపోయినందుకు బాధపడుతూ.

"నువ్వేం యివ్వవని భయంలేదు సూర్యం... నాకవసరమని అడుగుతున్నా. మంగళవారం మంచిరోజు. ఆ రోజు సరికి నువ్వెలాగయినా సర్దుబాటుచేస్తే యెంతో సహాయం చేసినవాడవవుతావు" అన్నాడు సుదర్శనం పెద్దమనిషి తరహాగా.

"అలాగే సుదర్శనం... నీ ప్రయాణం ఆపు చెయ్యటం నాకుమాత్రం యిష్టమా? నా శక్తి వంచనలేకుండా ప్రయత్నిస్తాను-" అన్నాడు సూర్యం.

"నేనిలా అడిగానని మరేం అనుకోకేం... వస్తానుమరి" అంటూ వెళ్ళిపోయాడు సుదర్శనం. సూర్యం ముందుకి భారంగా అడుగులు వేశాడు.

సూర్యం పరిస్థితి చూచి జాలిపొందాడు సుదర్శనం. కాని యేంచేస్తాడు? తనకా డబ్బు అందకపోతే ప్రయాణమే తప్పిపోతుంది... ఆరోజు తప్పిందా, మంచిముహూర్తాలు దగ్గర్లో లేవు. ముహూర్తాలకి కట్టుబడిపోయే మనిషి సుదర్శనం. అందుకే యీ అలజడి అంతాను.

సోమవారం రానేవచ్చింది. ఆరోజు కనీసం ఓ నాలుగుసార్లయినా సూర్యం యెదుట పడ్డాడు

సుదర్శనం, సూటిగా అడగలేక. సూర్యం అర్థం చేసుకోగలిగాడు సుదర్శనం ఎందుకలా అగుపిస్తున్నాడో! సూర్యం మాత్రం వూరుకున్నాడా? తీవ్రంగా డబ్బుకోసం ప్రయత్నిస్తూనేవున్నాడు. కాని యెక్కడా అప్పు పుట్టకండా వుంది. స్నేహితునిదగ్గర యెల్లాంటి అపవాదు, తగాదా, పడవల్సివస్తుందోనన్న భయం సూర్యాన్ని వెంటాడింది. సుదర్శనంలాంటి వుత్తమ వ్యక్తికి విరక్తి పుట్టించటం సూర్యానికి ఇష్టంలేదు... కాని డబ్బు దొరికేమార్గం కన్పించలేదు.. సుదర్శనంతో చెప్పుతున్నాడు మంగళవారం సరికి యివ్వగలనేమోనని.

సుదర్శనం మాత్రం యేమంటాడు! ఓ వేపు అతని కనుమానంగానే వుంది, సూర్యానికి సకాలంలో డబ్బుదొరకదని. ఎక్కడో, యెలాగో, తల తాకట్టు పెట్టయినా మంగళవారం తప్పక తెచ్చియివ్వమని ఖచ్చితంగా చెప్పేటంతటి కటిక హృదయుడు కాడు సుదర్శనం. సరే! గట్టి ప్రయత్నం చెయ్యమనిమాత్రం చెప్పగలిగాడు.

ఇప్పుడు సుదర్శనానికి ముహూర్తం తప్పిపోతుందేమోనన్న బెంగపట్టుకుంది. సూర్యాన్ని కూడా అలాంటిబాధేతరుముతోంది-స్నేహితుడికి విరక్తి కలిగిస్తున్నానేమోనని. భగీరథ ప్రయత్నాలుగావించి చివరకి విఫలుడయ్యాడు. విసిగిపోయాడుకూడా. మంగళవారం సరికి కూడా డబ్బు సమకూడింది కాదు. సుదర్శనంకి యేం జవాబుచెప్పడమో, యెలా చెప్పడమో, అర్థం కాలేదు సూర్యంకి. అవమానంతో బాధపడుతున్నాడు.

ప్రయాణ సన్నాహంలో వున్న సుదర్శనం మంగళవారం సూర్యం యింటికి వచ్చాడు... సూర్యం స్నేహితుణ్ణి చూడ్డంతో బిక్కముఖం వేసుకుని మౌనంగా తలదించుకున్నాడు. సుదర్శనం అర్థంచేసుకున్నాడు సూర్యం ప్రయత్నం ఫలించలేదని. ఏదో తప్పుచేసిన వాడిలా దీనంగా, మౌనంగా నిల్చున్న సూర్యంని చూస్తూ నీరైపోయాడు సుదర్శనం.

కాని డబ్బులేనిదే సుదర్శనం ప్రయాణం ఎలా చేస్తాడు? కనీసం ఓ నూరురూపాయలైనా వుండాలాయె-అప్పటికప్పుడెలాతటస్థపడతాయ్! సూర్యం యిస్తాడన్న ధీమాతోవుండి తనసలు ప్రయత్నమే చెయ్యలేదు.

"నాకు తెలుసు సూర్యం - నువ్వు బాధపడుతున్నావని... కాని నా పరిస్థితి చెప్పానుగా- రెండురోజులు పోతేనేగాని నాచేతికి డబ్బురాదు. అందుకే నిన్ను వత్తిడిచేయాల్సి వచ్చింది; రెండు రోజులవరకూ ఆగితే ముహూర్తంలేదు. ఇప్పుడేం చెయ్యటమో తోచకుండావుంది..." అన్నాడు సుదర్శనం నెమ్మదిగా.

సుదర్శనం సున్నిత హృదయానికి సూర్యం మనస్సులో నమస్కరించుకున్నాడు, మరొకడైతే సూర్యాన్ని నీచాతినీచంగా తూలనాడేవాడే! కాని సుదర్శనం అలా అంత కఠినుడు కాలేకపోయాడు. సుదర్శనంకి తెలుసు-కష్టాలంటే యేవిటో!

"నేను చాల చింతిస్తున్నా సుదర్శనం. నీలాటి స్వచ్ఛమైన స్నేహితుణ్ణి వంచన చేశానే అనుకో! ఇదో అపకారం లాంటిదే... ఎన్నివిధాల నేను ప్రయత్నించినా మాటదక్కించుకోలేకపోయాను. క్షమిస్తావనుకుంటాను." అన్నాడు సూర్యం ఎంతో బాధపడుతూ. అలా అంటున్నప్పుడతని కళ్ళల్లో నీటి పొరలు స్పష్టంగా కనిపిస్తున్నయ్. సుదర్శనం మరి మాట్లాడలేకపోయాడు. అప్పట్లో తన ప్రయాణం ఆపుకుంటేనేమంచిదనుకున్నాడు; లోలోపల ఆరోజు ప్రయాణం తప్పిపోయింది కదా అన్న బాధవున్నప్పటికీ... "పోనీలేరా సూర్యం. నువ్వేం బాధపడకు. ప్రయాణం రెండు రోజులపాటుఆపుచేస్తున్నా తరువాతేవెళ్ళొచ్చు" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

సూర్యం నవ్వలేకపోయాడు. అతని హృదయంలో ఇంకా బాధగానేవుంది. వ్యక్తుల కష్టాల్ని, క్లిష్టపరిస్థితుల్ని అర్థంచేసుకునిఆదుకునే సుదర్శనం లాంటి వానికెలా కృతజ్ఞత తెలియజెయ్యాలో అర్థం కాలేదు.

"నీలాంటి వ్యక్తులుండటం అరుదు సుదర్శనం. పరిస్థితుల్ని అర్థం చేసుకోగలవు. నీమేలు నేను ఎప్పుడూ మర్చిపోను. నీకెలా కృతజ్ఞత చెప్పాలో తెలీకండా వుంది" అన్నాడు సూర్యం.

"వస్తాను మరి." అంటూ నవ్వుకుని వెళ్ళిపోయాడు సుదర్శనం.

అనుకున్నట్టుగానే మరుచటిరోజు సుదర్శనం పురోహితుని దగ్గరికిపోయి మరో ముహూర్తం చూడమన్నాడు.

"ఏంబాబూ! నిన్నను వెళ్లలేదూ?" అన్నాడు పురోహితుడు.

"లేదండి..." అన్నాడు సుదర్శనం.

"నిన్నటిలాంటి బలమైన శుభముహూర్తం మరి యీ సంవత్సరంలో లేదండి" అన్నాడు పురోహితుడు, ఓపట్టు పొడుం పీలుస్తూ-

"మరేంచేస్తాం లెండి...పరిస్థితు లనుకూలించాయి కాదు."

"ఈ వస్తున్న శుక్రవారం మంచిదేనండి" అన్నాడు పంచాంగం చూస్తూ బోసినవ్వుతో పురోహితుడు.

"సరేనండి" అనుకుంటూ సుదర్శనం పురోహితుని చేతిలో పావలా కాసు పెట్టి చక్కా బయటికి వచ్చాడు. కొంతదూరం నడచిన తరువాత రామారావు సైకిలుతో ఎదురుపడి ఆశ్చర్యంగా నవ్వుతూ సైకిలుదిగి "ఏంరా సుదర్శనం నువ్వు వెళ్ళలేదూ?" అన్నాడు.

"లేదురా శుక్రవారం వెల్తాను" అన్నాడు. సుదర్శనం మంచిముహూర్తం పోగొట్టుకున్నందుకు నిరుత్సాహంగా.

"చాలా మంచిపనిచేశావు...యిక నీగురించి నేనిప్పుడాందోళనలోపడ్డానంటేనమ్ము" అన్నాడు రామారావు. తలా తోకాలేని అతడి మాటల్లో అర్థం వ్యక్తం కాక తెల్లబోయాడు సుదర్శనం.

"మంచి పనేమిటి! మంచి ముహూర్తం తప్పిపోతేనూ..." అన్నాడు.

"వెధవ ముహూర్తాలూ నువ్వునూ...ముహూర్తాలకాలం పోయిందిరా! చూశావా పేపరు?" అంటూ చేతిలోవున్న పేపర్ని విప్పాడు.

"ఏమయిందేమిటి...?" ఆత్రుతగా అడిగాడు చదివే ఓపికలేక.

"ఇంకేమయింది. నిన్నటి మద్రాసు మెయిలు పట్టాలమీదినుండి ఒరిగిపడింది..." అన్నాడు రామారావు.

"ఎక్కడ?" ఆశ్చర్యంగా అడిగాడు సుదర్శనం.

"బరంపురం దగ్గర...నువ్వు నిన్న వెళ్తానని చెప్పావుకదూ, నేను భయపడ్డాను."

"అంత ప్రమాదం జరిగిందా?"

"మెల్లిగా అడుగుతున్నావు. పదిమంది వచ్చి మంచినీళ్ళయినా అడగకండా చచ్చిపోయారు. వందకిపైగా గాయాలు తగినవాళ్లున్నారట. పత్రికల్లో యిలా రాశారేగాని, నిజానికి యింతకంటె యెక్కువ ప్రమాదాలే వుండొచ్చు" అన్నాడు రామారావు. సుదర్శనం పెద్ద నిట్టూర్పువిడిచాడు. ఆ మాటలు వింటుంటేనే అతని శరీరం ఆపాద మస్తకం చెమటతో నిండిపోయింది. అతని కళ్లెదుట సూర్యం దీనంగాకన్పించి మాయమయాడు.

"ఏమిట్రా అలా అవలిస్తున్నావ్? యింక మీవాళ్లెవరైనా బండిలోవున్నారా?" ఆదుర్దాగా అడిగాడు రామారావు.

"లేదురా - సూర్యంవల్ల నాకు జరిగిన సహాయాన్ని తలచుకుంటున్నా" అన్నాడు సుదర్శనం పరధ్యానంగా.

"ఏమిటూ సహాయం...?"

"అసలు వాడి మూలాన్నే నేను ప్రయాణం తప్పించుకోవల్సి వచ్చింది."

"ఏం?"

"వాడు డబ్బు యిచ్చినట్టయితే నిన్నటి మెయిల్లో పోయేవాణ్ణే...నా అదృష్టవశాత్తూ వాడు డబ్బు యివ్వలేకపోయాడు."

"అంతేరా....ఇదంతా భగవంతుని దయ.... సూర్యం పరంగా నువ్వు రక్షింపబడ్డావ్" అన్నాడు రామారావు.

"వస్తారా...యింక సూర్యందగ్గరికి పోవాలి" అంటూ ముందడుగు వేశాడు సుదర్శనం.

సుదర్శనం వెళ్ళేసరికి సూర్యం యేదో ఆలోచిస్తున్నాడు అంతు లేకండా; సుదర్శనం వచ్చాడన్న ధ్యాసైనా కలగలేదు. సుదర్శనం వూహించగలిగాడు సూర్యం యేంటాలోచిస్తున్నాడో...

"ఏమిటి సూర్యం- అలా ఆలోచిస్తున్నావ్....?" అన్నాడు సుదర్శనం. సూర్యం తుళ్లిపడ్డాడు. మళ్ళీ డబ్బు అడగాలనే వచ్చి వుంటాడన్న అనుమానంతో బెదిరిన లేడిలా చూస్తున్నాడు. సుదర్శనం యెదుటి కుర్చీలో కూర్చున్నాడు.

"ఏమీలేదురా... వూరికనే ఇలా కుర్చున్నా" అన్నాడు సూర్యం మెల్లగా.

"నువ్వు చెప్పకపోయినా అర్థం చేసుకున్నా

వేరా... పోనీగానీ, నీకెలా కృతజ్ఞత తెలియజెయ్యాలో తెలీకుండా వుంది" అన్నాడు సుదర్శనం నవ్వుతూ. సూర్యం ఆశ్చర్యపోయాడు. అతడికి అనుమానం తగిలింది యెగతాళి చేస్తున్నాడా అని.

"నాకా...? కృతజ్ఞతా..." అప్రయత్నంగా సూర్యంనోటినుండి వచ్చాయి మాటలు.

"ఔను..."

"ఎందుకూ...?"

"నా ప్రాణాన్ని రక్షించినందుకు..."

"నేనా..." నవ్వాడు సూర్యం. సుదర్శనం వేళాకోళంగా మాట్లాడుతున్నాడని హృదయంలో స్థిరపడిపోయింది.

"నిజం సూర్యం... నువ్వు నిన్న ను డబ్బివ్వక పోవటం నా ప్రాణాన్ని రక్షించినట్టే అయింది."

"అదెలా...?" అర్థంకాక అడిగాడు సూర్యం.

"నువ్వు యివ్వాల్టి పేపరు చదవలేదూ?"

"ఏమయింది?"

"నిన్నటి మద్రాసు మెయిలు ప్రమాదానికి గురి అయిందట. ఎంతోమందికి గాయాలు తగిలినయ్. కొందరు మరణించారు."

"నిజంగానే..." ఆత్రంగా అడిగాడు సూర్యం.

"నిజం సూర్యం! నువ్వు నాకు చాలా వుపకారం చేశావ్‌రా. ఇప్పుడా డబ్బుగురించి నువ్వెక్కడా ప్రయత్నించొద్దు. నీ దగ్గరెప్పుడుంటే అప్పుడే యిచ్చేయొచ్చు" అన్నాడు సుదర్శనం నవ్వుతూ.

సూర్యం హృదయం యిప్పుడు తేలికపడింది. ఏదో పెద్ద భారాన్ని నెత్తిమీదినుండి దించుకున్నట్టుగా అయింది. మెల్లగా నవ్వాడు సుదర్శనం; సూర్యం ముఖంలో సంతృప్తి అయిన నవ్వును యిప్పుడు చూడగలిగాడు.

---

(8-వ పేజీ తరువాయి)

చివరకు కృష్ణా-రెగ్యులేటర్ నిర్మాణానికి అతివైభవంగా ఆరంభప్రదర్శనం జరిగినా పని ప్రారంభం ఆలస్యమౌతున్నది. అందువల్లనే అభిప్రాయాలకు, ఆరంభోత్సవాలకు, అతిగా చేసే ప్రకటనలకు ప్రజలు విలువ ఇవ్వక పని జరుగుతుందా లేదా అన్న ప్రశ్న వేస్తున్నారు.

* * *

ఆంధ్ర ప్రభుత్వం నీటితీరువ రేటును పెంచ దలచినట్టు రివెన్యూమంత్రి సూచించారు: పురోభివృద్ధి సదుపాయాలు పెరిగినకొలదీ పన్నులు పెంచవలసిందే. కాని అన్నీవున్నా అల్లుడినోట్లో శని వున్నదన్నట్టు, ఆయకట్టుకు అనువైనసమయంలో నీటిని సప్లయిచేయలేని ప్రభుత్వం నీటి తీరువ రేటును పెంచడం సముచితం కాగలదా? పంట కాల్వల దిగువగ్రామాల భూములకు ఆగస్టునెలలో నీరు సప్లయిచేస్తూ వున్నందున పంటల రాబడి తగ్గుతున్న సంగతి ప్రభుత్వానికి తెలుసునా? కాల్వలకు తూములు పెట్టడంలో లోపాలవల్లను, కుడిమరమ్మతు పనులు జరిపించకపోవడంతోను రైతులు ఎంతగా నష్టపోతున్నారో ప్రభుత్వం గ్రహించిందా? ఈ ప్రశ్నలకు సమాధానం కార్యరూపంలో రానంతవరకు పన్నులు పెంచితే వచ్చే ప్రతిఫలం ప్రభుత్వ వ్యతిరేకత పెరగడమే.

* * *

ఆమధ్య మద్రాసు శ్రీప్రకాశ "గవర్నర్ల" బాధ్యతలనుగురించి ఉపన్యసిస్తూ కేంద్రానికి ప్రతినిధులుగా రాష్ట్ర వ్యవహారాలను అజ్మాయిషీ చేయడం గవర్నర్ల బాధ్యత అని చెప్పారు. ఆ బాధ్యతల నిర్వహణ గవర్నర్లుగావుండే వారి యోగ్యతలపైన ఆధారపడి వుండగలవని కూడా అన్నారు. కాని కేంద్రంమాత్రం యోగ్యతలు విచారించకుండా గవర్నర్లను నియమిస్తున్నదని ఒరిస్సావారు ఆందోళన చేస్తున్నారు. శ్రీ కుమారస్వామిరాజా ఎన్నికలలో వోడిపోవడమే కాక ఆయనపై అవినీతికి సంబంధించిన అనేక ఫిర్యాదులను బాధ్యతకలిగిన ప్రజానాయకులు చేశారు. ప్రజలలో ఆయన అల్లరిపాలైనారు. అలాంటి వారిని ఒరిస్సా గవర్నరుగా నియమించడం ఆమోద యోగ్యంకాదు: పార్లమెంటు ఎన్నికలలో వోడిన శ్రీ కె. సంతానంగారినికూడా వింధ్యప్రదేశ్ లెఫ్ట్‌నెంట్ గవర్నరుగా నియమించి, గవర్నరుపదవులను అధికారంలోవున్న పార్టీ ప్రయోజనాలకు వినియోగిస్తున్నారన్న విమర్శలకు అవకాశమిచ్చారు. పోనీ యోగ్యతలుగల గవర్నర్లు అయినా సరువుగా ప్రవర్తిస్తున్నారా